# మిగిలింది నాలుగు రోజులే..

## ఉమ్మడి జిల్లాలో ఊపందుకున్న ప్రచారం

- దూకుడు పెంచిన బీఆర్‌ఎస్
- విజయవంతమైన కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలు
- కేటీఆర్ రోడ్‌షోకు నీరా'జనం'
- గడపగడపకూ సకుటుంబ సపరివార సమేతంగా..
- కాంగ్రెస్, బీజేపీ సభలు అట్టర్‌ఫ్లాప్
- రెండు పార్టీల నేతల్లో టెన్షన్
- ఉమ్మడి జిల్లాలో పొలిటికల్ హీట్

మహబూబ్‌నగర్, నవంబర్ 24(నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం తుదిదశకు చేరుకోవడంతో అన్ని పార్టీల అభ్యర్థులు అస్త్రశస్త్రాలు ఉపయోగిస్తున్నారు. గ్రామాలు, పట్టణాల్లో హోరాహోరీగా ప్రచారం చేస్తున్నారు. ఆయా పార్టీల అభ్యర్థుల ప్రచారంతో పొలిటికల్ హీట్ పెరిగిపోయింది. ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి అన్నిపార్టీలు తంటాలు పడుతున్నాయి. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని 12నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థుల తరపున ప్రచారం చేశారు. అన్ని నియోజకవర్గాల్లో పర్యటించారు. 12ప్రజాఆశీర్వాద సభలు కనీవిని ఎరుగని స్థాయిలో విజయవంతం కావడంతో గులాబీ శ్రేణుల్లో జోష్ నెలకొంది. మరోవైపు కాంగ్రెస్, బీజేపీ అధినేతలు హాజరైన పబ్లిక్ మీటింగ్‌లు తుస్సుమనడంతో ఆ పార్టీ అభ్యర్థుల్లో టెన్షన్ నెలకొంది. ఉమ్మడి జిల్లాలోని మెజార్టీ నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నువ్వా నేనా అనే రీతిలో పోటీపడుతుండగా బీజేపీ నేతలు మాత్రం డిపాజిట్లు దక్కించుకుంటే చాలని భావిస్తున్నారు. మరోవైపు అభ్యర్థులతోపాటు కుటుంబ సభ్యులు ప్రచారంలోకి దిగడంతో రసవత్తరంగా మారింది. ఉదయం తెల్లవారుజాము నుంచి అభ్యర్థులు గ్రామాల్లోకి వెళ్లి గడపగడపకూ ప్రచారం చేస్తున్నారు. బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధి కార్యక్రమాలు మళ్లీ హ్యాట్రిక్ విజయమందిస్తే చేపట్టే కార్యక్రమాలను వివరిస్తున్నారు. కర్ణాటకలో ఐదు గ్యారెంటీలు విఫలమయ్యాయని తెలంగాణలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు కూడా ప్రజలు నమ్మే స్థితిలో లేరని బీఆర్‌ఎస్ నాయకులు ఓటర్లకు వివరిస్తున్నారు. ఒకరిపై ఒకరు ఆరోపణలు ప్రత్యారోపణలతో వాతావరణం వేడెక్కింది. మరోవైపు కాంగ్రెస్, బీజేపీలకు రెబల్స్ బెడద తీవ్రతరమైంది. టికెట్ రాని వాళ్లంతా పార్టీకి ఓటెయ్యొద్దని ప్రచారం చేస్తున్నారు. మరోవైపు బీఆర్‌ఎస్‌కు రోజురోజుకు పెరుగుతున్న ఆదరణను చూసి కాంగ్రెస్ నేతలు దాడులకు తెగబడుతున్నారు. గ్రామాల్లో పుకార్లను పుట్టించి కాంగ్రెస్ కార్యకర్తలను రెచ్చగొడుతున్నారు. అచ్చంపేట నియోజకవర్గంలో ఏకంగా బీఆర్‌ఎస్ అభ్యర్థి గువ్వల బాలరాజుపై దాడి చేశారు. కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గి మండలం సర్జఖాన్‌పేటలో ఏకంగా బీఆర్‌ఎస్ కార్యకర్తలపై రాళ్లతో దాడి చేశారు. కొల్లాపూర్‌లో మద్యం సరఫరా చేస్తున్నారని దొంగ ఆరోపణలకు దిగి ఏకంగా పోలీసు వాహనంపై రాళ్ల గాడికి తెగబడ్డారు. పోలీసులను కొట్టి ఉల్టా పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నాకు దిగడం కొసమెరుపు. ఇంకా ప్రచారానికి నాలుగు రోజులే సమయం ఉండడంతో అభ్యర్థులంతా గ్రామాల్లో తిరుగుతున్నారు.



షాషాబ్‌గుట్టలో స్థానికులతో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్



వనపర్తి మండలంలో ప్రచారంలో మంత్రి నిరంజన్‌రెడ్డి

### పట్టణాలు గ్రామాల్లో మైకుల హోరు

అసెంబ్లీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పార్టీలు ప్రచారంతో హోరెత్తెస్తున్నారు. పట్టణాలు గ్రామాల్లో నాయకుల మైకుల గోలతో నిండిపోయింది. అన్నిపార్టీల ప్రచార రథాలు తిరుగుతున్నాయి. జిల్లా కేంద్రాల్లో పాటలు, ఆటలతో ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. కొంతమంది మేం బీఆర్‌ఎస్కే ఓటేస్తాం మా ఇంటికి రావొద్దంటూ బ్యానర్లు కట్టారు. మరోవైపు ఆయా పార్టీలు తమదైన శైలిలో ప్రచారం చేస్తున్నారు. గులాబీ పార్టీ అభ్యర్థులపై పాడిన పాటలు జనాలను విపరీతంగా ఆకర్షిస్తున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా తాండ్రకు చెందిన లక్ష్మమ్మ పాడిన గులాబీల జెండాలమ్మ రామక్క పాట రాష్ట్రవ్యాప్తంగా మారుమగుతోంది. ఈ పాటకు యూట్యూబ్‌లో మిలియన్‌ల కొద్ది వ్యూస్ రావడంతో లక్ష్మమ్మకు క్రేజ్ పెరిగిపోయింది.

### అభివృద్ధి మంత్రంతో ముందుకు..

తెలంగాణ రాకముందు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వలసలు, ఆకలి కేకలకు ప్రసిద్ధి. తెలంగాణ వచ్చాక పాలమూరు పరిస్థితి పూర్తిగా మారిపోయింది . గతంలో సాగు, తాగునీళ్లు లేక వలసలు పోయిన జనం మళ్లీ స్వగ్రామాలకు తరలివస్తున్నారు ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పంతో పాలమూరు జిల్లా స్వరూపాన్ని మార్చి వేశారు. ఉమ్మడి జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు పోటీపడి అభివృద్ధి చేసి చూపించారు. 14రోజులకొకసారి వచ్చే తాగునీటి మిషన్ భగీరథతో రోజు అందిస్తుండడంతో ప్రజల కష్టాలు తీర్చేశారు. దీంతో జిల్లాకేంద్రాలు, మున్సిపాలిటీలు, గ్రామాలు పచ్చనీ తోరణాలుగా మారాయి. అభివృద్ధి కార్యక్రమాలు పోటాపోటీగా చేశబూరు. అభివృద్ధి కార్యక్రమాలు ఫోకస్ చేస్తూ బీఆర్‌ఎస్ ముమ్మరంగా ప్రచారం చేస్తుంది.

### కాంగ్రెస్ గ్యారెంటీలను నమ్మని జనం

కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను జనం ఎవరూ నమ్మడం లేదు. ఎక్కడికెళ్లినా నిలదీస్తున్నారు. పక్కనే కర్ణాటకలో అధికారం గురించి ఆరు నెలలు కాకముందే ఒక్క హామీ కూడా అమలు కాకపోవడంతో అక్కడి రైతులు ప్రజలు తెలంగాణలో స్వచ్ఛందంగా వచ్చి ప్రచారం చేస్తున్నారు. దీంతో కాంగ్రెస్ నేతలు వారిని అడ్డుకునే ప్రయత్నం చేస్తూ కర్ణాటక రైతులను కట్టడి చేస్తున్నారు. ఆ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఇవ్వని వాళ్లు ఇక్కడ ఏమిస్తారని బీఆర్‌ఎస్ ప్రశ్నిస్తూ.. ఇదే అంశాన్ని ప్రజల్లోకి తీసుకుపోతుంది.

### బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోపై జనం ప్రశంసలు

బీఆర్‌ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తే చేపట్టే కార్యక్రమాలపై గ్రామాల్లో ఎక్కడ చూసినా చర్చ జరుగుతోంది. కేసీఆర్ చెప్పింది చేసి చూపిస్తాడని జనం అంటున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో రూ.200 ఉన్న ఆసరా పింఛన్లు రూ.వెయ్యికిఆ తర్వాత రూ.2016కు పెంచి కేసీఆర్ ఎంతోమందికి ఆసరాగా నిలిచారని అంటున్నారు. ఈసారి కూడా పింఛన్లు రూ.3వేలు చేసి క్రమక్రమంగా రూ.5వేలకు తీసుకెళ్తాడని వృద్ధులు, వితంతువులు బలంగా నమ్ముతున్నారు. కల్యాణలక్ష్మి, రైతుబంధు, 24గంటల కరెంట్ రైతు బీమా ఇచ్చిన కేసీఆర్ మళ్లీ అధికారం లో వస్తే సౌభాగ్యలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టి 18ఏండ్లు నిండిన ప్రతి మహిళకు రూ.3వేల ఆర్థిక సాయంపై మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రేషన్‌కార్డున్న అందరికీ సన్నబియ్యమిస్తుండంటూ అప్పుడే ప్రచారం చేస్తున్నారు. కేసీఆర్ బీమా పథకం కూడా గ్రామాల్లో విస్తృతంగా పాకింది. అగ్రవర్ణాల పేదలకు ఆర్థిక సాయాలు, రెసిడెన్షియల్ స్కూళ్లు ఇతర సదుపాయాలు అందజేస్తుండడంతో జనం బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోకు జేజేలు పలుకుతున్నారు.

# కాంగ్రెస్ నాయకుల మాయమాటలు నమ్మొద్దు

- కొడంగల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

మద్దూర్(కొత్తపల్లి), నవంబర్ 24: ఎన్నికల సమయంలో తప్పా మళ్లీ ఎప్పుడు కనబడని కాంగ్రెస్ నాయకులను నమ్మొద్దని కొడంగల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని దోరేపల్లి, పల్లెగడ్డతండా, ఎర్రగోల్‌తండా,



మహిళలతో మాట్లాడుతున్న కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

అప్పిరెడ్డిపల్లి, అచ్చంపల్లి, చెన్వార్, పర్సాపూర్, దామ్‌గాన్‌పూర్, నాగిరెడ్డిపల్లి, నాగంపల్లి, ఖాజీపూర్, రేణివట్లలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పట్నం మాట్లాడుతూ.. కొడంగల్ నియోజకవర్గంలో ఏ ఊరికైనా సరే ఊరిపేరు చెప్పి ఇద్దరం కలిసి కార్లో బయలుదేరుదం ఆ ఊరిని గుర్తు పట్టి తీసుకుపో చూద్దామని కొడంగల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. కేసీఆర్ హయంలో తెలంగాణ ఎంత అభివృద్ధి చెందిందో, యావత్తు దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తుందన్నారు. రైతులకు 3 గంటల కరెంట్ చాలన్న కాంగ్రెస్ పార్టీకి ఓటేద్దామా, 24గంటల కరెంట్ ఇస్తున్న సీఎం కేసీఆర్‌కు మద్దతు తెలుపుదామో రైతులు అలోచించుకోవాలని కోరారు. వారెంట్ లేని గ్యారెంటీలను ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్ వంటి అనేక రకాల సంక్షేమ పథకాలను నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా ఇచ్చామన్నారు. అలాగే బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించారు. కార్యకర్తలకు నేనెప్పుడూ అండగా ఉంటానని, ప్రజలకు అందుబాటులో ఉంటానని.. నా ప్రజలకు తెలుసన్నారు. కొడంగల్, కామారెడ్డిలో రేవంత్‌రెడ్డి చిత్తుచిత్తుగా ఒడిపోతాడు. మరి ఎలా ముఖ్యమంత్రి అవుతాడన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ డైరెక్టర్ సలీం, నాయకులు బాల్‌సింగ్, శివకూమర్, బసిరెడ్డి, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌ను నమ్ముకుంటే కర్ణాటక గతే..

- 3గంటల కాంగ్రెస్సా.. 24గంటల కేసీఆర్ కావాలా?
- జడ్చర్ల నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి




మల్లెబోయిన్‌పల్లిలో మహిళను ఓటు అడుగుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

జడ్చర్ల, నవంబర్ 24: కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మి మోసపోవద్దని.. ఆ పార్టీని నమ్ముకుంటే కర్ణాటక గతే పడుతుందని జడ్చర్ల నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జడ్చర్ల మండలంలోని మాటుబండతండా, శంకరాయపల్లి, పోచమ్మగడ్డతండా, కొత్తతండా, మల్లెబోయిన్‌పల్లి, చిట్టబోయిన్‌పల్లి, యాసాయకుంటతండా, తంగెళ్లపల్లి, అల్వాన్‌పల్లి, కుర్వగడ్డపల్లి, ఆలూరు, బూర్గుపల్లి, కిష్టంపల్లి, చర్లపల్లి, నసరుల్లాబాద్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్యేకు ఆయాగ్రామాల ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అన్ని గ్రామాల్లో ప్రజలు మంగళహారతులు, బ్యాండు మేళాలలతో ఘనస్వాగతం పలికారు. బొట్టుపెట్టి ఆహ్వానం పలికారు. ఇంటింటికీ తిరుగుతూ బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఆయా గ్రామాల్లో ప్రజలను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని ఓట్లువేస్తే గ్రామాలు అంధకారంలోకి వెళ్తాయన్నారు. కరెంట్ ఎప్పుడొస్తుందో తెలియని పరిస్థితులు వస్తాయన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిఇంటికీ సంక్షేమ ఫలాలు అందాయన్నారు. వ్యవసాయానికి 3గంటల కరెట్ ఇస్తామని, 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని రేవంత్ చెబుతుండడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం 10ఏండ్లలో రాష్ర్టాన్ని, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిందన్నారు. బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే పేద మహిళకు సౌభాగ్యలక్ష్మి పథం కింద రూ.3వేలు, రూ.400కే సిలిండర్, దశలవారీగా రైతుబంధు, పింఛన్లు పెంచుకుంటూ పోదామన్నారు. రేషన్‌కార్డు దారులందరికీ సన్నబియ్యం, రైతుబీమా తరహాలో కుటుంబానికి రూ.5లక్షల బీమా సౌకర్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలందరు ఆలోచించి మంచిచేసే, పనిచేసే వారికి పట్టం కట్టాలని కోరారు. కారుగుర్తుకు ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బాదేపల్లి మార్కెట్ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, జెడ్పీవైస్ చైర్మన్ యాదయ్య, పీఏసీసీఎస్ చైర్మన్లు సుదర్శన్‌గౌడ్, మల్లేశ్, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణీల్, ముడా డైరెక్టర్ ఇంతియాజ్, పీఏసీసీఎస్ మాజీ చైర్మన్ దశరథరెడ్డి, సర్పంచులు రాజేశ్వర్‌రెడ్డి, బాలసుందర్‌రెడ్డి, యాదమ్మ, విజయలక్ష్మి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రఘుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

# బీఆర్‌ఎస్ విజయంలో భాగస్వాములుకావాలి

- మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి
- గులాబీగూటికి మందిప్పల్ బీజేపీ నాయకులు



ఎమ్మెల్యే చిట్టెం సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న బీజేపీ నాయకులు

మక్తల్ టౌన్, నవంబర్ 24: అసెంబ్లీ ఎన్నికల్లో గులాబీ జెండా విజయానికి భాగస్వాములై మక్తల్ గడ్డపై గులాబీ జెండా విజయానికి తోడ్పాటును అందించాలనే లక్ష్యంతో బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి అన్నారు. మక్తల్ నియోజకవర్గంలోని మాగనూరు మండలం మందిప్పల్ ఎంపీటీసీ సత్తెమ్మ తనయుడు ఉమేశ్ శుక్రవారం ఎమ్మెల్యే చిట్టెం సమక్షంలో గులాబీ గూటికి చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిట్టెం మాట్లాడుతూ.. 2023 ఎన్నికల్లో మక్తల్ అసెంబ్లీ సీటును బీఆర్‌ఎస్ కైవసం చేసుకోవడానికి ప్రతికార్యకర్త సైనికుల్లా పనిచేయడంతోపాటు ఇతర పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని పేర్కొన్నారు. పార్టీలో చేరిన ప్రతిఒక్కరికీ సమన్యాయం కల్పించడంతోపాటు కొత్త, పాత తేడా లేకుండా ప్రతిఒక్కరికీ న్యాయం చేస్తామన్నారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారుగుర్తుకు ఓటు వేసి, వేయించి అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపించి మక్తల్ గడ్డపై బీఆర్‌ఎస్ జెండాను ఎగరేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాగనూరు మండలాధ్యక్షుడు ఎల్లారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు మధుసూదన్‌రెడ్డి, జయానంద్‌రెడ్డి, నాయకులు రఘు, అశోక్‌గౌడ్, వెంకటేశ్‌చారి, వెంకటేశ్, నరేశ్‌గౌడ్, శాంతప్ప, లింగప్పతోపాటు తదితరులు ఉన్నారు.